అదుగో హంతకుడు!

టెంపోరావ్

శమంత టైమ్ చూసింది. ఏడు దాటింది. హాల్లో ఫ్లోర్ సెంట్ లైట్లు వెలుగుతున్నాయి. ఒక ఫాన్ తిరుగుతోంది. పెద్ద సోఫాలో ఆమె కూర్చుని వుంది. ఎదురుగా నిలబడి వుంది వంటామె మంగమ్మ.

"అన్నీ టేబుల్ మీద పెట్టానమ్మా. వెళ్ళొస్తాను" అంది మంగమ్మ.

"రేపు అక్కయ్య వస్తుంది. ఎనిమిదింటికల్లా ఇడ్లీ, చట్నీ, సాంబార్ అన్నీ తయారుగా వుండాలి" అంది శమంత.

"అలాగే నమ్మా" అని మంగమ్మ కదిలింది.

హాల్లోంచి ఆమె బయటకు వెళ్ళింది. మంగమ్మ వెళ్ళిపోగానే ఆమె తలుపులుమూసి గడియలు బిగించింది. క్షణకాలం అక్కడ నిలబడి ఆమె కిందకు చూసింది. మేడ మెట్లు దిగుతూన్న వంటామె రూపం అద్దాల తలుపు ల్లోంచి ఆమెకు కనిపిస్తోంది. ఎవరైనా ఆ మెట్లెక్కి పైకి

రావాలి. అద్దాల్లోంచి వాళ్ళను చూసి తలుపుతీస్తూ వుండొచ్చు. వెనకవైపు మేడమెట్లున్నాయి. పనివాళ్ళు మాత్రం ఆ మెట్లను ఉపయోగిస్తూ వుంటారు.

శమంత హాల్లోకొచ్చి టేబుల్ మీదున్న డయనోరా టి.వి. ని ఆన్ చేసింది. వెళ్ళి సోఫాలో కూర్చుంది. టి.వి. స్క్రీన్ వైపు ఉత్సాహంగా చూస్తోంది. అనేక ఫోటోలతో సరోజినీ నాయుడు జీవితచరిత్రను చిత్రిస్తున్నారు. పెద్ద పెద్ద పదవులను సరోజినీ నాయుడు అలంకరించింది. మహాత్మాగాంధీతో ఆమె రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ కి లండన్ వెళ్ళింది. కొన్నేళ్ళపాటు కాంగ్రెస్ ప్రెసిడెంట్ గా వుంది. ఇండియాకి స్వాతంత్ర్యము వచ్చాక ఆమె గవర్నరయింది. ఎన్నో ఘనకార్యాలు సాధించిన సరోజినీ నాయుడు చివరికి అస్వస్థురాలై మృత్యువుకు తలొంచింది. ఇదంతా టి.వి. లో చూస్తూంటే శమంత హృదయంలో ఉద్రేకం రేకెత్తింది. ప్రతీ ప్రాణీ ఆఖరికి చావక తప్పదు!

యువతీ యువకులు పాడుతున్నారు. టెలిఫోన్ మ్రోగింది. ఆమె రిసీవరెత్తి, "హలో, శమంత!" అంది.

"నేను శమంతా" అందో పురుష కంఠం అటువైపు నుంచి.

ఆమె కిలకిల నవ్వింది.

"మైడియర్, నీ కాల్ కోసం ఎదురు చూస్తున్నాను."

"ఎప్పుడు రాను?"

ఆమె క్షణకాలం మౌనంగా వుండిపోయింది.

"పన్నెండు తర్వాత."

"నీకోసం పన్నెండు దాకా మేలుకుని వుండాలి."

"మైడియర్. ఉయ్ కాంట్ హెల్పిట్. మనిష్ట

ప్రకారం కలుసుకోడం సాధ్యంకాదు. అది నీకు తెలుసు. రేపు అక్కయ్య ఇక్కడకొస్తుంది. ఆ సమయంలో మాత్రం నువ్వు యిటువైపు రాకు. ఆమెను గురించి నీకు బాగా తెలుసుగా!"

"ఓల్డు హేగ్!" అన్నాడతను నవ్వుతూ.

"సరిగ్గా పన్నెండింటికి వెనుక తలుపులు తెరిచి వుంచుతాను. నువ్వు లోపలకొచ్చి తలుపులు మూయొచ్చు."

"బైబై డార్లింగ్ అన్‌టిల్ ట్వెల్వోక్లాక్!"

ఆమె రిసీవర్ని పెట్టేసి సోఫాలో వెనక్కి వాలింది. ఆమెకు గతం గుర్తుకొస్తోంది. ఆమె భర్త పెద్ద వుద్యోగం చేసి, ప్లేన్ యాక్సిడెంట్‌లో మరణించాడు. అప్పటికి ఆమె వయస్సు నలభై సంవత్సరాలు. పెద్దకొడుకు అమెరికా వెళ్ళాడు. చిన్న కొడుకు చదువుకుంటున్నాడు. భర్త బతికి వున్నప్పుడు రెండు కార్లు వుండేవి. అతడు పోయాక ఒక్క కారును మాత్రం ఆమె వుంచుకొంది. ఎన్నడూ ఆమెకు డబ్బులోటు తెలియదు.

పెద్దకొడుకు అమెరికన్ యువతిని పెళ్ళాడి స్టేట్స్‌లో స్థిరపడిపోయాడు. అతడి పెళ్ళికి ఆమె అమెరికా వెళ్ళి తిరిగి వచ్చింది. రెండో కొడుకు పెద్దవాడయ్యాడు. ఆమె అనుమతి లేకుండా ఒక మళయాళీ యువతిని పెళ్ళాడాడు. దానితో ఆమెకు కోపం వచ్చింది. రెండో కొడుకు వుద్యోగం చేసుకుంటూ వేరే కాపురం పెట్టాడు. ఒంటరిగా జీవిస్తున్న తల్లిని అప్పుడప్పుడు వచ్చి చూస్తూ వుంటాడు. అతడి భార్య ఎన్నడూ ఆమంత యింటికి రాలేదు. ఆమె తనింటికి రావడం ఆమె కిష్టంలేదు.

టెలిఫోన్ మ్రోగింది. ఆమె రిసీవర్ని యెత్తింది.

"హలో!" అంది.

"నేనే, సుబ్బలక్ష్మిని" అందో కంఠం అటువైపు నుంచి.

"పొద్దుటే వస్తున్నావుగా? రేపిక్కడే లంచ్!" అంది శమంత.

"డ్రయివర్ ఏడింటికొస్తాడు. రాగానే బయల్దేరతాను."

"బావగారు యెలా వున్నారు?"

"అదే సితి, బెడ్‌రిడన్! ఎన్ని మందులిచ్చినా సింక్‌లో పడేసినట్లే!"

"డెబ్బయి ఏళ్ళ మనిషికి మందులు వుపయోగపడవు, అక్కా!"

"ఏం చేస్తున్నావు?"

"వంటది వెళ్ళిపోయింది. కూర్చుని టీవి చూస్తున్నాను."

"గుడ్‌నైట్, వస్తాను రేపు" అంది సుబ్బలక్ష్మి.

ఆమె రిసీవర్ని పెట్టేసి టైమ్ చూసింది. ఎనిమిదైంది. టి.వి.లో అరవ న్యూస్ చెప్తున్నారు. ఆమె లేచింది. బయటకు వెళ్ళింది. డాబామీద పిట్టగోడ పక్కనే నిలబడి కిందకు చూసింది.

నౌఖరు రామయ్య తోటలో పచార్లు చేస్తున్నాడు. రామయ్య మెట్ల గదిలోనో, లేక బయట వరండామీదో పడుకుంటాడు. డాబామీదున్న ఆమె వైపు అతడు పైకి చూశాడు.

"నేను భోజనం చేసి పడుకుంటాను. ఎవర్నీ పైకి రానివ్వకు!" అందామె.

"అలాగేనమ్మా" అన్నాడతను.

ఆమె హాల్లోకివచ్చి తలుపు మూసి గడియలు బిగించింది. డైనింగ్ టేబుల్ దగ్గర కెళ్ళి కుర్చీలో కూర్చుంది.

కంచం, కూల్ వాటర్, వండిన పదార్థాలు అక్కడ సిద్ధంగా వున్నాయి; ఆమె తింటూ టివి చూడసాగింది.

భోజనం ముగించి ఆమె పడగ్గదిలోకి వెళ్ళింది. దుస్తులు తీసేసి పల్చటి సిల్కు మేక్సీ వేసుకుంది. ఆమె చెవులకున్న డైమండ్ కమ్మలు మెరుస్తున్నాయి.

మెళ్ళో పదికాసుల చంద్రహారం వుంది. అమెరికాలో కొన్న చేతిగడియారం మెరుస్తోంది. ఆమె 11-55కి అలారం పెట్టింది. అద్దంముందు నిలబడి రన రూపాన్ని పరీక్షించుకుంది.

తన వయస్సు యిప్పుడు యాభై రెండేళ్ళు. అయినా తనింకా ముసలిదానిలా కనపడ్డంలేదు. ముప్ఫయి ఐదేళ్ళ ప్రియుడు తన కోసం పరితపిస్తున్నాడు. తను ముసలి దానిలా కనపడివుంటే అతడామె చెంతకు వచ్చేవాడు కాదు. ప్రతిరోజూ తను చేసే వ్యాయామం, బీచ్ వాకింగ్ బలాన్నిచ్చే భోజనం తన సహజ సౌందర్యాన్ని యింకా నిలబెట్టింది. లోలోపల ఆనందిస్తూ, ఆమె పరుపు మీద వాలింది.

టైమ్ తొమ్మిది దాటింది. జీరోవాట్ లాంప్ మసగ్గా వెల్గుతోంది. తమంత కాసేపట్లో నిద్రలోకి జారిపోయింది.

2

11-55కి రిస్టువాచ్ అలారం కొట్టింది. గాఢనిద్ర లోంచి ఆమె లేచింది. క్షణకాలం మౌనంగా కూర్చుని మెల్లిగా మంచం దిగి హాల్లోకి వెళ్ళింది. వెనుక తలుపు దగ్గరకు చప్పుడు చెయ్యకుండా నడిచింది. అక్కడ చీకటిగా వుంది. సెకండ్లు గడుస్తున్నాయి. తలుపు దగ్గరగా ఆమె నిలబడింది.

ఏ క్షణంలోనయినా అతడు రావచ్చు!

ఎవరో మెల్లిగా మెట్లెక్కుతున్నారు. ఆమె గడియలు తీసి తలుపులను తెరిచింది. అతడి రూపం నీడలా బయట నిలబడివుంది. తటాలున అతడు లోపలకొచ్చాడు. తలుపులు మూసి గడియవేశాడు. అమాంతంగా అతని చేతులు ఆమెను చుట్టేశాయి.

"ఇక్కడ కాదు. పడగ్గదిలోకి పద" అందామె తగ్గు స్వరంలో.

ఇద్దరూ పడగ్గదిలోకెళ్ళారు. జీరోవాట్ బల్బు వెలుగుతోంది. పరుపుమీద ఆమె వెల్లకిలా పడుకుంది. పక్కనే కూర్చుని అతడామె చెయ్యిని పట్టుకున్నాడు.

"నువ్వు వస్తూంటే ఎవ్వరూ చూడలేదుగా?" అడిగిందామె.

అతడు చిలిపిగా నవ్వాడు.

"డోన్ట్ వర్రీ శమంతా! గత పదేళ్ళుగా ఎవ్వరూ చూడకుండా జాగ్రత్తపడ్డం నాకు అలవాటేగా!"

అతడు నవ్వుతూ ఆమెమీదకు ఒరిగాడు. లిప్ స్టిక్ తో ఎర్రబడిన ఆమె పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"మళ్ళా నువ్వు అమెరికా వెళ్ళాలా?"

"వచ్చే నెలలో వెళ్తాను. నెలలోపల తిరిగొచ్చేస్తాను. పెద్దకొడుకు ప్లేన్ టికెట్ పంపిస్తున్నాడు."

"నువ్వు లేకుండా యిక్కడ జీవించడం ఎడారి బతుకులా వుంటుంది."

ఆమె నవ్వుతూ అతని మెడను నిమిరింది.

"యూ ఆర్ ఎంగ్ ఫెలో. నాకంటే పదిహేడేళ్ళు చిన్నవాడవు. మన సంబంధం ఎంతకాలం ఉంటుందో నాకే తెలీదు" అందామె.

"ప్లీజ్ డోన్ట్ సే దట్! నువ్వంటే నాకు చాలా

ప్రేమ. నేనందుకే పెళ్ళిచేసుకోకుండా ఉండిపోయాను."

ఆమె సంతోషంగా కిందకు దిగింది. గోడవారగా వున్న టేబుల్ వైపు వెళ్ళింది. గ్లాసులో కొంత విస్కీ పోసి కూల్ సోడా కలిపింది.

అతడు దగ్గరగా వెళ్ళి ఆమె యిచ్చిన గ్లాసు అందుకున్నాడు "ఛియర్స్!" అని తాగడం ప్రారంభించాడు.

ఆమె మంచం మీద కూర్చుంది. పక్కనే కూర్చుని అతను తాగుతున్నాడు. నవ్వుతూ అతడివైపు చూసింది.

"కొంచెంగా స్కాచ్ సేవిస్తే మంచిదే. డోస్ ఎక్కువయితే నిద్రపోతావు" అందామె నవ్వుతూ.

"శమంతా, నువ్వూ తీసుకో."

"నో ప్లీజ్, అమెరికాలో ఎందరో నాకు డ్రింక్స్ ఆఫర్ చేశారు. కాని నేను తీసుకోలేదు."

"తాగితే కాని రుచి తెలియదు."

"రుచుంటేగా తెలియడానికి!"

అతడు గ్లాసు ఖాళీచేశాడు. గబగబా వెళ్ళి గ్లాసులో మళ్ళా స్కాచ్ విస్కీ పోసుకున్నాడు. కూల్ సోడా కలిపాడు. తాగుతూ పరుపు మీద పడుకుని వున్న ఆమె వైపు నవ్వుతూ చూశాడు.

"కమాన్, యూ ఆర్ డ్రింకింగ్ టూ మచ్!" అందామె.

అతడు గడగడా తాగేసి గ్లాసును టేబుల్ మీనుంచి ఆమె దగ్గరకొళ్ళాడు. నిషా ఎక్కుతోంది. ఆమె మీద అమాంతంగా వాలిపోయాడు. ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయాడు.

"ఏమిటలా చూస్తున్నావు?"

"మై డియర్, నాకు నీ సహాయం కావాలి.

నిన్నెప్పుడూ నేనేదీ అడగలేదు. నేను ఇరకాటంలో పడ్డాను."

"ఏం కావాలి?"

"ఏభై వేలు!"

ఆమె కళ్ళు చిట్లించింది.

"గుడ్ హెవెన్స్! నా యింట్లో డబ్బుల చెట్టుందా? భర్త మరణించి పన్నెండేళ్ళు అయింది. తిండికి లోటు లేకుండా ఎలాగో జీవితాన్ని సాగిస్తున్నాను."

"నీ దగ్గర బ్లాక్ మనీ కావల్సినంతవుంది. అందులోంచి నేనడిగింది యిస్తే నీకేం కొరతా రాదు. తరవాత నేనెప్పుడో అదంతా తిరిగిచ్చేస్తాను."

"ప్లీజ్ డబ్బును గురించి మనం పోట్లాడొద్దు. నువ్వంటే నాకెంతో ప్రేమ. నా దగ్గర డబ్బుంటే నీకు తప్పక యిచ్చేదాన్ని. ప్రస్తుతం లేదు. నన్ను చూసి నా దగ్గర లక్షలున్నాయని చుట్టుపక్కలవాళ్ళు అనుకుంటూ ఉంటారు. అదంతా నువ్వు నమ్మకు."

అతడు కిందకు దిగాడు. టేబుల్ దగ్గర కెళ్ళి గ్లాసులో విస్కీ పోసి సోడా కలిపాడు. అక్కడే నిలబడి తాగుతూ ఆమెవైపు చూశాడు.

ఆమె పరుపుమీద లేచి కూర్చుంది. అతడివైపు సూటిగా చూసింది.

"ప్లీజ్, యింక తాగొద్దు. ఎక్కువగా తాగి అల్లరి చేస్తే మన గుట్టు బయటపడ్తుంది."

అతడు విచిత్రంగా నవ్వాడు. గ్లాసును ఖాళీచేసి ఆమె ముందు కెళ్ళాడు. ఇప్పుడతను మంచి నిషాలో ఉన్నాడు. ఆమె కిందకు దిగింది. అతడి భుజంమీద చెయ్యి వేసింది.

"నో మోర్ డ్రింకింగ్ ప్లీజ్!" అని ఎటాచ్డ్

బాత్ రూమ్‌లోకి వెళ్ళింది. మెల్లిగా వెళ్ళి అతను గుమ్మంలో నిలబడ్డాడు. వెనుదిరిగి అతని వైపు చూసిందామె.

"ఏమిటలా వున్నావు?" అడిగిందామె.

తటాలున పేంట్ జేబులోంచి అతడు కత్తిని బయటకు తీశాడు. ఆమె ఉలిక్కిపడింది. బాత్ రూమ్‌లో లైటు వెలుగుతోంది. గుమ్మంలో అతడు యమదూతలా నిలబడి ఉన్నాడు. ఆమె బుర్ర శరవేగంగా ఆలోచిస్తోంది.

"ఏమిటీ ఘోరం? నిన్ను ఇంతగా ప్రేమించిన నాకు కత్తి చూపిస్తున్నావా? సిగ్గులేదూ?" అందామె కోపంగా.

అతడు కోపంగా ఆమెవైపు చూశాడు.

"ప్రేమ! ఏమిటి నీ ప్రేమ? నేను నీ దగ్గరకు వచ్చినప్పుడు ఇరవై అయిదేళ్ళ యువకుడ్ని. నీ హస్తాల్లో నన్ను బంధించి, నీ బోన్లో యిరికించి నా సర్వాన్ని జుర్రుకు తాగి నీ కామాన్ని తీర్చుకుంటున్నావు. ఏభై వేలు యిమ్మని అడగ్గానే నీ ప్రేమెంతో నాకు వెంటనే తెలిసిపోయింది. ఇవాళతో మనిద్దరి బంధం శాశ్వతంగా తెగిపోయింది. ఇటుపైన ఏ యువకుడ్నీ వలేసి పట్టుకునే అవకాశం నీకు లేకుండా చేస్తాను."

"రాస్కెల్, అరుస్తాను. అందరూ పైకి వస్తారు. నువ్వు పట్టుబడిపోతావు!" అందామె.

"అరిచే అవకాశం నీకు రాదు" అని అతడామె నోరును ఎడంచేత్తో గట్టిగా నొక్కాడు. కుడిచేతిలోని కత్తి అమాంతంగా ఆమె వీపులోకి దిగింది. శమంత తటాలున కిందపడింది. ఆమె ఛాతీమీద మరో నాలుగు సార్లు పొడిచాడతను. ఆమె ధరించిన మాక్సీ రక్తమయ

మయింది. బాత్ రూమ్ గచ్చు నేల మీద రక్తం ప్రవహిస్తోంది.

అతడు బేసిన్ దగ్గరకెళ్ళాడు. టాప్ తిప్పి కత్తినీ, చేతుల్నీ కడుక్కున్నాడు. తన గుడ్డల్ను పరీక్షించుకున్నాడు. గుమ్మంవైపు వెళ్లాడు. అక్కడ నిలబడి రక్తం మడుగులో పడున్న శమంతవైపు చూశాడు.

పడగ్గదిలోకి చేరుకున్నాడు. జీరో వాట్ బల్బు కాంతిలో అతనంతా చూడగల్గాడు. తలగడ కిందున్న తాళంచెవుల గుత్తి తీసుకుని గాద్రెజ్ బీరువాని తెరిచాడు. గదిలో దొరికిన ఒక బాగ్ లో నోట్లకట్టలను పడేసుకున్నాడు.

టైమ్ చూశాడు. బీరువాకి తాళంవేసి తాళంచెవుల గుత్తిని తలగడకింద పెట్టేశాడు. మెల్లిగా టేబుల్ దగ్గరకు వెళ్ళాడు. కొంచం విస్కీ గ్లాసులో పోసుకుని సోడా కలిపి గడగడా తాగేశాడు. గ్లాసును పాంట్ జేబులో దాచుకుని అతడు బయటకు నడిచాడు.

హాల్లోంచి వెనుకవైపుకు వెళ్ళాడు. గడియలు తెరిచి, ఓ తలుపు తీసి, గడపదాటి బయట క్షణకాలం నిలబడి కిందకు చూశాడు. అంతా నిశ్శబ్దంగా వుంది. చుట్టూ చీకటి. అతడు మెల్లిగా మెట్లు దిగాడు. నేలమీద కాలు పెట్టి యిటూ అటూ చూసి చీకట్లోకి వెళ్ళిపోయాడు.

గోడవారగా నిలబడివున్న కూనయ్య తలను వెనక్కు తిప్పాడు. పిల్లిలా మెట్లు దిగి చీకట్లోకి పారిపోతున్న ఆ వ్యక్తివైపు ఆశ్చర్యంగా చూశాడు.

కూనయ్య క్షణకాలం చీకట్లో మౌనంగా ఉండిపోయాడు. ఆతడు పైకి ఎందుకు వెళ్ళాడు? కూనయ్య ఆలోచిస్తూ మెట్ల ముందుకి వెళ్ళాడు. అతడి గుండె దడ

దడ కొట్టుకుంటోంది. మెల్లిగా మెట్లెక్కాడు. ఒక తలుపు తెరిచివుంది. అడుగులో అడుగు వేస్తూ కూనయ్య హాల్లోకి చేరుకున్నాడు. పక్కనున్న పడగ్గదిలోకి వెళ్లాడు. ఎటాచ్‌డ్ బాత్‌రూమ్ గుమ్మంలో నిలబడి నేలమీద పడున్న ఆమెను చూసి అరవబోయి నోరు నొక్కేసుకున్నాడు.

3

అప్పుడే వెలుగొస్తోంది. పనిమనిషి బెల్ నొక్కింది. ఆ ధ్వని విని రామయ్య లేచాడు. మెట్లగది గుమ్మంబయట వుంది ఎలక్ట్రిక్ బెల్.

గుమ్మం ముందు నడవలో పడుకున్న రామయ్య లేచి పనిమనిషి వంక చూశాడు.

"అమ్మగోరింకా నిద్దరోతుండారు" అన్నాడతను.

"ఇయాల ఆలస్యంగా కూడా వచ్చాను" అందామె.

"కాసేపు కూకో!" అన్నాడు రామయ్య.

"బెల్ మళ్ళా ఏసి చూడు!"

"బాబోయి! అమ్మకు కోపంవస్తే ఉద్యోగం వూడ్తుంది. నీ వయసులో ఉన్నదానికి 200 రూపాయలు ఎవ్వరూ యివ్వరు" అన్నాడతను.

అరగంటపాటు పని మనిషి ఇంటిచుట్టూ పచార్లు చేస్తూ కాలం గడిపింది. వెనక వైపున కూనయ్య ఆమెకు తటస్థపడ్డాడు.

"ఏం చెల్లీ యిక్కడ తిరుగుతున్నావు?"

"అమ్మగారు నిద్దరోతుండారు."

కూనయ్య సంచి పట్టుకుని గేటుదాటి బయటకు వెళ్ళిపోయాడు. అతడివైపు రామయ్య వింతగా చూశాడు. పనిమనిషి అతడి దగ్గరకు తిరిగివచ్చింది.

"బెల్ నొక్కయ్యా!"

రామయ్య బెల్ నొక్కాడు. డాబావైపు చూశాడు. బెల్ నొక్కగానే శమంత డాబామీద ప్రత్యక్షమయి వెనక తలుపులు తెరిచానని మామూలుగా చెప్పడం పరిపాటి.

రామయ్య కాసేపు ఆలోచించాడు.

"వెనక తలుపులు తెరిచారేమో, చూద్దాం పద" అని అతడు వెనక్కి వెళ్ళాడు.

రామయ్య, వెనకనే పనిమనిషి మేడమెట్లుఎక్కారు. ఒక తలుపు తెరిచి వుంది.

"చూశావా, తలుపు తెరిచి అమ్మ పడుకునివుంటుంది. నీ పని చూసుకో" అని రామయ్య కిందకు దిగాడు.

ముందు వైపుకు వెళ్ళి పచార్లు చేస్తున్నాడు.

పైనుంచి పనిమనిషి గావుకేక విని రామయ్య ఉలిక్కి పడ్డాడు. పిచ్చెత్తిన వాడిలా వెనక్కి పరుగెత్తి మేడ మెట్లెక్కి హాల్లోకి చేరుకున్నాడు. పడగ్గది గుమ్మంలో పని మనిషి నిలబడి వుంది. ఆమె మొహంలో భయం గోచరి స్తోంది.

"అమ్మగోరు! అమ్మగోరు బాత్ రూమ్‌లో పడున్నారు" అందామె.

రామయ్య పడగ్గదిలోకి వెళ్ళాడు. బాత్ రూమ్ గుమ్మంలో నిలబడి లోపలకు చూశాడు. ఏడుస్తూ హాల్లోకి తిరిగొచ్చాడు.

"ఎంత గోరం!" అంది పనిమనిషి.

"ఇప్పుడేం చెయ్యాలి?" అడిగాడు రామయ్య.

పనిమనిషి మాట్లాడలేదు.

"సుందరం బాబుకి చెప్పడం మంచిదేమో!"

"ఎల్లి చెప్పిరా."

"ఫోన్ చేసి చెపుతా" అని రామయ్య టెలిఫోన్ దగ్గరకు వెళ్ళాడు.

రిసీవర్ యెత్తి ఒక నంబరు తిప్పాడు. అటువైపు నుంచి ఒక స్త్రీ కంఠం వినపడింది. రామయ్య ఏడుస్తున్నాడు.

"ఎవరు నువ్వు, ఫోన్లో ఏడుస్తున్నావు?" అడిగిందా స్త్రీ.

"సుందరం బాబు రావాలమ్మా"

మరుక్షణంలో సుందరంబాబు అటువైపుకి వచ్చాడు.

"ఎవరు?"

"నేను బాబూ, రామయ్యని"

"రామయ్యా, ఎందుకలా ఏడుస్తున్నావు? ఏమైంది? అమ్మ కొట్టిందా?"

"లేదు బాబూ, అమ్మగారు బాత్ రూమ్లో పడుండారు. అంతా రక్తం బాబూ."

"అమ్మ బతికుందా?"

"చచ్చిపోయినట్టుంది బాబూ."

"రామయ్యా, నేను వెంటనే వస్తున్నాను. నువ్వక్కడే వుండు. ఎవర్నీ పైకి వెళ్ళనీయకు" అని సుందరం రిసీవర్ని పెట్టేశాడు.

పక్కనున్న యువతిని రెండు చేతుల్తోటీ సుందరం పట్టుకున్నాడు.

"మాధవీ, అమ్మకేదో అయినట్టుంది. వెళ్ళి చూస్తేగాని ఏం జరిగిందో తెలీదు, వెళ్దాం పద."

"నేనెందుకండీ?"

"నువ్వాయింటి కోడలివి."

మాధవి పరిహాసంగా నవ్వింది.

"ఇంతవరకూ నేనా యింట్లో అడుగు పెట్టలేదు. ఇప్పుడు రాడం నా కిష్టం లేదు."

"చూడు మాధవీ, రామయ్య చెప్పిందాన్నిబట్టి అమ్మ చనిపోయిందని తెలుస్తోంది. అన్నయ్య అమెరికాలో వున్నాడు. ఈ పట్నంలో వున్నది నువ్వూ నేనే. అమ్మ పోతే ఆ యిల్లూ ఆస్తీ మనకే చెందుతాయి. మనం అక్కడ వెళ్ళి చూడాలి."

"అయితే పదండి వెళ్దాం" అంది మాధవి.

సుందరం స్కూటర్ని యింటి ముందుకు తీసుకెళ్ళి ఆపాడు. వీధి తలుపు మూసి తాళంవేసి వచ్చింది మాధవి. అతను స్కూటర్ని స్టార్టుచేసి కూచున్నాడు. వెనుక సీటు మీద మాధవి సర్దుకుంది. సుందరం స్కూటర్ని పోనిచ్చాడు.

ఇరవై నిముషాల్లో ఛామియర్స్ రోడ్డులో వున్న ఆ యింటి ముందు స్కూటర్ ఆగింది. రామయ్య ఏడుస్తూ సుందరం కెదురుగా వచ్చాడు.

"రండి బాబూ, వెనక మెట్లమ్మట వెళ్దాం."

సుందరం, మాధవి వెనుక మెట్లెక్కి పైకి వెళ్ళారు. బాత్ రూమ్ గుమ్మంలో నిలబడి నేలమీద పడున్న తన తల్లివైపు సుందరం చూశాడు. "అమ్మా!" అని ఏడుస్తూ మాధవి భుజంమీద తల వాల్చేశాడు. ఆమె అతడిని మెల్లిగా తీసుకొచ్చి హాల్లో వున్న సోఫాలో కూర్చోబెట్టింది. అతనివైపు దీనంగా చూసింది. "ఈ సమయంలో మీరు ధైర్యంగా వుండాలి. మీ అమ్మను యెవరో ఘోరంగా హతమార్చారు. మీరు వెంటనే పోలీసు రిపోర్టు యివ్వాలి."

సుందరం భార్య చెయ్యిని పట్టుకున్నాడు.

"మాధవీ, ఆ రిపోర్టు ఏదో నువ్వే యియ్యి."

మాధవి టెలిఫోన్ దగ్గరకెళ్ళి రిసీవరెత్తి నంబరు తిప్పింది. అటువైపు నుంచి పురుష కంఠం వినపడింది.

"హలోవ్, నా పేరు మాధవి. మా అత్తగార్ని ఎవరో హత్యచేశారు. నా భర్త పేరు సుందరం. మేమిద్దరం యిక్కడే వున్నాం" అందామె.

"అడ్రసు చెప్పండి."

ఆమె అడ్రసు చెప్పింది.

"మేమొస్తున్నాం. ఎవర్నీ ఏదీ ముట్టుకోనివ్వకండి" హెచ్చరించాడు పోలీసాఫీసరు అటువైపు నుంచి.

4

డిటెక్టివ్ వాలి తాజ్ కోరమాండల్ హోటల్లో పడకకుర్చీలో పడుకుని దిన పత్రిక చూస్తున్నాడు. టెలిఫోన్ మ్రోగింది. గిరి రిసీవర్ని అందుకున్నాడు.

"మీకోసం సార్" అని గిరి రిసీవర్ని వాలి కిచ్చాడు.

"హలో, వాలి హియర్."

"వాలిగారూ. ఏదో హత్య జరిగినట్లు యిప్పుడే రిపోర్టు వచ్చింది. దయచేసి మీరు అక్కడికి వస్తే చాలా సంతోషిస్తాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

"నాయర్ భాయ్, అడ్రెస్ చెప్పు" అన్నాడు వాలి.

ఇన్‌స్పెక్టర్ నాయర్ అడ్రెస్ చెప్పాడు.

"ఆల్‌రైట్ వస్తున్నా" అని వాలి రిసీవర్ని పెట్టేశాడు.

వాలి పడక్కుర్చీలోంచి లేచాడు. అతని నోట్లో పొడుగాటి చుట్ట వెలుగుతోంది. తన బుగ్గమీసాల్ని ఓ సారి వేళ్ళతో నిమురుకుని అతడు గిరివంక నవ్వుతూ చూశాడు.

"గిరీ, గత మూడు రోజుల్నుంచీ మనం విశ్రాంతిగా కాలాన్ని గడిపేస్తున్నాం. ఇప్పుడు పని తగిలింది, వెళ్దాం పద!"

వాలి గదిలోంచి బయటకు నడిచాడు. తలుపుమూసి తాళంవేసి గిరి గబగబా వాలిని వెంబడించాడు. ఇద్దరూ లిఫ్ట్‌లో కిందకు దిగారు. కింద హాల్లోంచి ఠీవిగా నడుస్తూ వెళ్తున్న వాలికి హోటల్ మేనేజర్ నమస్కరించాడు.

కాంపౌండ్‌లో వున్న ఎక్స్.వై.జడ్. కారులో వాలి ముందుసీటు మీద కూర్చున్నాడు. గిరి కారుని పోనిచ్చాడు.

కారు శరవేగంగా ప్రయాణం చేస్తోంది. వాలి మౌనంగా కూర్చుని బయటకు చూస్తున్నాడు. చుట్టపొగ పీల్చి వదుల్తున్నాడు.

పది నిముషాల్లో గేటు దాటి ఒక కాంపౌండులో పోలీసుజీప్ వెనకనే గిరి కారు నాపాడు. వాలి, గిరీ కిందకు దిగారు. గేటు ప్రాంతంలో, కాంపౌండులో అనేకమంది ప్రజలు నిలబడి వున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ పరుగెడ్తూ వాలి ముందు కొచ్చాడు.

"వాలిగారూ, నమస్కారం సార్. మీరు వెంటనే వచ్చినందుకు చాలా ఆనందిస్తున్నాను."

"నాయర్ భాయ్, మనం యెక్కడికెళ్ళాలి?"

"పైకి వెళ్ళాలి. ముందు తలుపులు మూసి వున్నాయి. మీరు వచ్చి చూసిందాకా ఆ తలుపుల్ని తెరవొద్దన్నాను. మనం వెనక వైపు నుంచి వెళ్దాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నాయర్.

ఇన్‌స్పెక్టర్ నాయర్, వాలి, గిరి వెనకవైపుకి వెళ్ళి మెట్లెక్కి పైకి చేరుకున్నాడు. బాత్‌రూమ్‌లో లైటు

ఇంకా వెల్గుతోంది. వాలి నేలమీద పడున్న స్త్రీ వైపు పరీక్షగా చూశాడు. శవం పక్కకి తిరిగి పడుంది. ఛాతీ మీద, వీపుమీద కత్తిపోట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె ధరించిన మాక్సీ రక్తంతో ఎర్రబడింది. ఆమె పాదాలు, పిక్కలు పచ్చగా కనిపిస్తున్నాయి. ఆమె ఒంటిమీద నగలు లేవు. ఒళ్ళంతా బోడిగా వుంది. నుదురు మీద బొట్టులేదు. హత్యకు ఉపయోగించిన ఆయుధం గదిలో యెక్కడా లేదు.

చుట్టపొగ పీల్చి వదుల్తూ వాలి బాత్ రూమ్ నాలుగు వైపులా చూశాడు. ఒకవైపున కమోడ్ వుంది. రెండో వైపున సింక్, రెండు కుళాయిలు, గోడకద్దం కనిపిస్తున్నాయి. మరోవైపున వీనస్ ఎలక్ట్రిక్ హీటర్ పైన అమర్చబడి వుంది.

వాలి పక్కనున్న ఇన్స్పెక్టర్ వైపు తిరిగాడు.

"ఈమె పేరు?"

"శమంత సార్."

"అమ్మాయి విధవా?"

"యూ ఆర్ రైట్ సార్. ఆమె భర్త పన్నెండేళ్ళ క్రితం మరణించారు. పెద్దకొడుకు మోహన్ అమెరికాలో వుంటున్నాడు. రెండో కొడుకు సుందరం ఇదే పట్నంలో తన భార్యతో వేరే వుంటున్నాడు. ఈ మేడమీద శమంత ఒంటరిగా వుంటోంది. కిందభాగం అద్దెకిచ్చి ఆమె మేడ మీద వుంటోంది.

వాలి ఆలోచిస్తూ పడగ్గదిలో వెళ్ళాడు. రెండు గాడ్రెజ్ బీరువాలు, ఒక టేబుల్ వగైరా వున్నాయి. ఫాన్ కింద డబుల్ కాట్ వుంది. గదిలో జీరో వాట్ బల్బు వెల్గుతోంది. ఫాన్ తిరుగుతోంది.

టేబుల్ మీద స్కాచ్ విస్కీ బాటిల్ని వాలి పరీక్షించాడు. అందులో సగం పైగా విస్కీ వుంది. పక్కనే ఒక సోడాబుడ్డి ఖాళీగా వుంది. మరో బుడ్డీలో కొద్దిగా సోడా వుంది.

వాలి వెనక్కి తిరిగాడు. గిరి వెనకనే వున్నాడు.

"గిరీ, సుందరం యెక్కడున్నాడు?"

"హాల్లో వున్నాడు" అన్నాడు గిరి.

వాలి బయటకు నడిచాడు. హాల్లోని పెద్ద సోఫాలో సుందరం, మాధవి పక్కపక్కనే కూర్చుని వున్నారు. సుందరం ఏడుస్తున్నాడు.

సుందరం ఎదురుగా ఆగాడు వాలి.

"అబ్బాయి, సుందరం నువ్వేనా?"

"నేనే సార్. ఈమె నా భార్య మాధవి."

వాలి అతడివైపు సూటిగా చూశాడు.

"ముసలి తల్లిని ఒంటరిగా వదిలి నువ్వు వేరే కాపురం పెట్టడం విచిత్రంగా వుంది!" అన్నాడు వాలి.

"బాగా డబ్బున్న కుటుంబాల్లో యిటువంటివి జరుగుతూ వుంటాయి సార్. నా భార్యంటే మా అమ్మకు యిష్టంలేదు. మాధవి నా కాలేజ్ మేట్ చెల్లెలు. ఆమెను ప్రేమించి పెళ్ళాడాను. అమ్మ ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. అన్నయ్య అమెరికా వెళ్ళి అక్కడో యువతిని పెళ్ళాడితే ఆమె ఏమీ అనలేదు. కాని నా పెళ్ళి విషయంలో ఆమె మొండిపట్టు పట్టింది. చివరకి యిల్లువదిలి వెళ్ళిపోయి ఆమెను పెళ్ళాడాను."

"నువ్వు ఏం చేస్తున్నావు?"

"బి.యి. పాసయ్యాను. ఒక ప్రయివేట్ యింజనీరింగ్

కంపెనీలో పనిచేస్తున్నాను. సంపన్న కుటుంబంలో పుట్టినా పెళ్ళయ్యాక మధ్యతరగతివాడిలా నేనో చిన్న ఫ్లాట్‌లో జీవిస్తున్నాను."

"అబ్బాయ్, మీ నాన్న ఏం చేసేవాడు?"

"ఆయన ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌లో వుండేవారు. ఒక విమానం ఎక్సిడెంట్‌లో ఆయన మరణించారు."

"మీ అమ్మకి యెవరేనా శత్రువులున్నారా?"

"ఎవరుంటారు సార్? ఆమె సాధారణంగా పరాయి వాళ్ళతో కలిసి తిరిగే రకం కాదు. మొదట్నించీ ఆమె చాలా దర్జాగా పెరిగింది. ఆమెకున్న స్నేహితులు చాలా తక్కువమంది."

"నువ్వూ నీ భార్యా యిక్కడికొచ్చి ఆమెను అప్పు డప్పుడు చూస్తూ వుండేవారా?"

"నేను తరచు వచ్చి ఆమెను చూసి వెళ్ళిపోతూ వుండే వాడిని. అమ్మ బ్రతికుండగా నా భార్య యెప్పుడూ యిక్కడికి రాలేదు. ఇవేళే మొదటిసారిగా వచ్చింది!"

"మీ అమ్మ పోయాక ఈ ఆస్తంతా ఎవరికి కుంది?"

"అమెరికాలో వున్న అన్నా నేనూ పంచుకోవాలి."

వాలి అతనివైపు సూటిగా చూశాడు.

"మీ అమ్మ ఒంటిమీద బాగా నగలు ఉండేవను కుంటాను. ఇప్పుడవేవీ కనబడ్డంలేదు!"

"వాలిగారూ, శవాన్ని చూశాక నేనూ వాటిని గురించే ఆలోచించాను. అమ్మ చెవులకు డైమండ్ కమ్మ లుండేవి. పది కాసుల చంద్రహారం ఆమె మెళ్ళో ఎప్పుడూ ఉండేది. కుడిచేతికి అరడజను గాజులుండేవి. ఎడంచేతికి అమెరికాలో కొన్న ఖరీదయిన ఆటోమాటిక్ వాచ్ వుండేది. అవన్నీ యిప్పుడులేవు. డబ్బుకోసం ఈ

హత్య జరిగిందేమో" అన్నాడు సుందరం.

"అబ్బాయ్, కింద భాగంలో ఎవరుంటున్నారు?"

"గత పదేళ్ళుగా కామరాజు అనే ఆయన ఉంటున్నారు? ఆయనిచ్చే అద్దె చాలా తక్కువ. పదేళ్ళ క్రితం అయిదువందలు అద్దె ఆయనిచ్చేవారు. ఇప్పుడూ అదే అద్దె మీద ఉంటున్నారు. ఈ పదేళ్ళల్లోనూ ఈ ప్రాంతంలో అద్దెలు బాగా పెరిగిపోయాయి. ఆయనుండే గ్రవుండ్ ఫ్లోర్‌కి ప్రస్తుతం అనేకమంది రెండువేలు యివ్వడానికి సిద్ధంగా వున్నారు. అమ్మతో ఈ విషయం నేనెన్నిసార్లో చెప్పాను. ఆమె కామరాజుతో మాట్లాడుతాననేది. కాని అద్దె మాత్రం అయిదువందల్లోనే ఉండిపోయింది."

"అబ్బాయ్, అయిదువందలు ఆఫీషియల్‌గా యిచ్చి అతను బ్లాక్‌లో వేరే యిచ్చేవాడేమో!"

"దాన్ని గురించి నేను చెప్పలేను సార్."

"మీ అమ్మ దగ్గర రొక్కంగా చాలా డబ్బుందా?"

"చాలా వుందని పెద్దమ్మ ఎన్నిసార్లో చెప్పేది."

అదే సమయంలో ఏడుస్తూ ఒక స్త్రీ వెనుకవైపు నుంచి హాల్లోకొచ్చింది. సుందరం పరుగెత్తుకెళ్ళి ఆమెను కౌగలించుకుని ఏడవసాగాడు. ఇద్దరూ గోడవారగా కూలబడిపోయి ఏడుస్తున్నారు. వాలి సమీపంలో నిలబడి వాళ్ళను గమనిస్తూ వుండిపోయాడు.

కొంతసేపయినాక వాలి మెల్లిగా వాళ్ళముందు కెళ్ళాడు. ఆమె వయిపు నూటిగా చూశాడు. ఆమె వయస్సు అరవయ్యేళ్ళుంటుంది.

"అమ్మాయ్, శమంత నీ చెల్లెలా?"

"అవును సార్. రాత్రికి రాత్రి దాని జీవితం ఇలా అడుగంటిపోతుంతని నేను కల్లో కూడా అనుకోలేదు.

నిన్న రాత్రి దాంతో ఫోన్‌లో మాట్లాడేను...."

"ఎన్నింటికి?"

"ఎనిమిది ప్రాంతంలో! ప్రొద్దుటే నన్నిక్కడికి రమ్మంది. ఇడ్లీ, చట్నీ, సాంబారు చేయించి ఉంచుతా నంది. చిన్నప్పట్నించీ మా యిద్దరికీ తిండంటే మహా యిష్టం."

"అమ్మాయ్, నువ్వోకసారి లోపలికి వెళ్ళి నీ చెల్లెలి శవాన్ని చూసిరా!"

ఆమె కళ్ళమ్మట నీళ్ళు జలజల కారాయి.

"నేను హార్టు పేషెంటుని. అందుకే యిక్కడ కూర్చుండిపోయాను."

"నీ చెల్లెలు దగ్గర చాలా డబ్బుందా?"

"చాలా వుండాలి సార్. బ్యాంకుల్లో కనీసం ఏడెనిమిది లక్షలు ఉంటుంది. అనేక పెద్ద కంపెనీల్లో ఆమెకు షేర్లు ఉన్నాయి. యింట్లో రెండుమూడు లక్షలు ఎప్పుడూ రొక్కంగా ఉంటుందని ఆమె నాతో ఎన్ని సార్లో అంది. ఆమె దగ్గర లక్షపైన విలువచేసే నగలు ఉన్నాయి."

ఇన్స్పెక్టర్ నాయర్ అక్కడకొచ్చాడు. వాలి అతడివైపు తిరిగాడు.

"నాయర్ భాయ్, శమంత యింట్లో ఎన్నో నగ లుండాలి. రొక్కంగా చాలా డబ్బు ఉండాలిట. నీ సమక్షంలో శమంత కొడుకు సుందరం బీరువాలూ అవీ తెరిచి చూడ్డం మంచిది. ఎంతపోయిందో మనకు తెలు స్తుంది" అన్నాడు వాలి.

"అలాగే చేయిస్తాను సార్" అన్నాడు ఇన్స్పెక్టర్.

వాలి హాల్లోనుంచి ముందువైపుకు వెళ్ళాడు. గిరి

వెనకనే నడిచాడు. ముందు మెట్లపైనున్న తలుపులు బిగించబడి వున్నాయి.

"ఇటువైపు నుంచి ఎవ్వరూ పైకి రాలేదని మనం అనుకోవాలి" అన్నాడు వాలి.

"నౌఖరు రామయ్య మెట్ల గదిలోనో, లేక గదిముందు వరండాలోనో పడుకుంటాడట. ఎవరైనా యిటువైపొస్తే అతడు చూసేవాడు" అన్నాడు గిరి.

వాలి చుట్ట పీలుస్తూ క్షణకాలం ఆలోచిస్తూ ఉండి పోయాడు.

"గిరీ, యీ తలుపులను బట్టి మనం ఏదీ నిర్ణయించ లేము. ముందు మెట్లు ఎక్కివచ్చిన వ్యక్తి, యీ తలుపులకు గడియలు బిగించి వెనక తలుపులు తెర్చుకుని వెళ్ళిపోయి వుండొచ్చు! కాని యీ తలుపులు ఒక్క విషయాన్ని మనకు తెలియజేస్తున్నాయి. ముందు తలుపులూ, వెనక తలుపులూ మూసుకుని శమంత నిద్ర బోతుంది. ఎవరైనా పైకి ఎలా రాగలరు? తలుపులు పగలగొట్టి రావాలి. కాని అటువంటి సూచనలు ఎక్కడా లేవు. అయితే ఎలా వచ్చారు? ఆమె తలుపులు తెరిచి ఉండాలి!" అన్నాడు వాలి.

తార్కికంగా ఆలోచించి వాలి చెప్పినది విని గిరి ఆశ్చర్యపోయాడు.

"వాలిగారూ, ఎవరో హంతకుడు వస్తే ఆమె తలుపు ఎందుకు తెరుస్తుంది?" ప్రశ్నించాడు గిరి.

వాలి గంభీరంగా నవ్వాడు.

"గిరీ, హంతకుడు కూడా మనిషే! అది మర్చిపోకు! పులిని చూసి అందరూ భయపడ్తారు. పిల్లిని చూసి అంతగా భయపడరు. పులి పిల్లి రూపంలో యింట్లోకి

రావచ్చు. వచ్చాక దాని నిజరూపం తెలుస్తుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభించదు!" అన్నాడు వాలి.

"అయితే ఆమెకు బాగా తెలిసిన వ్యక్తి ఎవరో వచ్చుండాలి! అతడు తలుపును తట్టితే ఎవరేనా చూసి వుండొచ్చు."

ఆలోచిస్తూ వాలి నడవలో పచార్లు చేస్తూ డాబా మీదకు వెళ్ళి నలువైపులా చూశాడు. వెనుదిరిగివస్తూ కిటికీలోంచి హాల్లోని టెలిఫోన్ వైపు చూశాడు.

"గిరీ, ఇది పాష్ లొకాలిటీ! ఇక్కడ ఎవ్వరూ తలుపులు తట్టి గట్టిగా అరవరు. ఇంటికొచ్చినవాళ్ళు యెలక్ట్రిక్ బెల్ నొక్కుతారు. కాని బెల్ నొక్కితే అనేకమంది వింటారు. కొందరు ఫోన్ చేసి, టైమ్ ప్రకారం వస్తారు. బెల్ నొక్కవలసిన అవుసరం అప్పుడు వుండదు. యెవరో ఫోన్లో మాట్లాడి వచ్చుండాలి. ఆమె తలుపు తెర్చివుండాలి!"

"చాలా దగ్గర మనిషి అయితేగాని ఆ సమయంలో ఆమె తలుపు తెరవదు!" అన్నాడు గిరి.

"దగ్గర వ్యక్తే! కొడుకు కావచ్చు!" అని వాలి కళ్ళు మూసుకుని తీవ్రంగా ఆలోచించాడు.

పల్చటి సిల్కు మేక్సీలో ఉన్న శవం అతడికి జ్ఞప్తి కొచ్చింది. మేక్సీ అడుగున మరేదుస్తులూ లేవు!

"కొడుకు కావచ్చు! ప్రియుడు కావచ్చు!" అన్నాడు వాలి.

గిరి ఫక్కున నవ్వాడు.

"ఆమెకు ప్రియుడున్నాడంటారా?"

"గిరీ, ప్రస్తుతం నేను ఆలోచిస్తున్నాను. ఆమె

పెదిమలమీద లిప్ స్టిక్ ఉంది. ఆమె పల్చటి మేక్సీలో ఉంది. పడగ్గదిలో స్కాచ్ విస్కీ బాటిల్, సోడా బుడ్లు ఉన్నాయి. ఆమెకు తాగే అలవాటు వుండొచ్చు! దాన్ని గురించి మనం కనుక్కోవాలి" అన్నాడు వాలి.

5

వాలి మెట్లమ్మట కిందకు దిగాడు. వెనక వైపున కారు షెడ్ ప్రక్కనే ఒక గది వుంది. ఆ గది తలుపుకు బయట తాళం వేసివుంది. అతడు షెడ్ లోకి చూశాడు. ఏ కారూ లేదు. ఖాళీగావుంది. నేలను వాలి పరీక్షించాడు. నేలమీది గుర్తులనుబట్టి యీ షెడ్ లో ఏ స్కూటరో ఉంచుతూ ఉండాలి.

వాలి మరి కొంతదూరం నడిచి ముందు మెట్లు దిగే చోటుకు వెళ్ళాడు. రామయ్య అక్కడ పచార్లు చేస్తున్నాడు. వాలి అతడివంక పరీక్షగా చూశాడు. బాగా ఏడ్చినట్లున్నాయి అతడి కళ్లు.

“నువ్వేనా రామయ్య?” అడిగాడు వాలి.

“అవును సార్.”

“ఆమె మరణించినందుకు నువ్వుచాలా ఏడ్చినట్లున్నావు. ఆమె పోతే నీ ఉద్యోగం పోతుందా?”

“కాదుసార్. పదేళ్ళపైగా ఇక్కడ పనిచేస్తున్నాను. కోపం వస్తే కొట్టేది. కాని మరుక్షణంలో దయచూపేది. ఆమెపోతే నా దగ్గరమనిషి యెవరో పోయినట్లు అనిపించింది.”

“నిన్నరాత్రి అమ్మతో నువ్వు మాట్లాడేవా?”

“డాబామీదనుంచి అమ్మగారు నాతో మాట్లాడారు. భోజనంచేసి పడుకుంటానన్నారు. యెవర్నీ పైకి రానీయ వద్దన్నారు.”

"రాత్రిళ్ళు ఆమెకోసం యెవరేనా వచ్చేవారా?"

"యెవ్వరూ రారు సార్. రాత్రిళ్ళు ఆమె పెందరాళే పడుకుని వెలుగొచ్చేలోపల లేచేవారు."

"పైన ఫోను మోగితే నీకు వినపడ్తుందా?"

"వినపడుతుంది సార్."

"క్రితం రాత్రి ఏడు తర్వాత ఫోన్ కాల్స్ వచ్చాయా?"

"రెండుసార్లు ఫోన్ మ్రోగడం నాకు వినపడింది, సార్."

వాలి చుట్టపొగ పీల్చి వదులుతూ ఆలోచించసాగాడు. అక్క సుబ్బలక్ష్మి ఫోన్ చేసి శమంతతో మాట్లాడింది. ఒక కాల్ సుబ్బలక్ష్మిదైతే రెండో కాల్ యెవరిది? హత్య చేసిన వ్యక్తి కాలా అది?

"నిన్నరాత్రి నువ్వు యెన్నింటికి పడుకున్నావు?"

"పదకొండింటికి సార్. అప్పటిదాకా నేనూ, కూనయ్య కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం."

"కూనయ్య యెవరు?"

"వాడు కిందవుండే కామరాజుగారి నౌఖరు."

"కామరాజు యింట్లో వున్నాడా?"

"ఆయన స్కూటర్ మీద ఆఫీసుకెళ్ళిపోయారండి. ఏడింటికల్లా ఆయన వెళ్ళిపోతారు. రాత్రి తిరిగొస్తారు. ఆయన తల్లి యింట్లో వొంటరిగా ఉంటుంది."

"అతడికి పెళ్ళి కాలేదా?"

"పెళ్ళిచేయడానికి ఆయన తల్లి ప్రయత్నిస్తున్నారు."

"అతడు పైకెళ్ళి శమంతతో మాట్లాడుతూ ఉంటాడా?"

"యెక్కువగా వెళ్ళరు సార్! వెళ్ళినా రెండు

మూడు నిమిషాల్లో తిరిగి వచ్చేసేవారు."

"కూనయ్య యెక్కడున్నాడు?"

వాడు పొద్దుటే సంచిపట్టుకుని బయటకు వెళ్ళాడండి. ఇంకా రాలేదు."

"అతనెక్కడ పడుకుంటాడు."

"షెడ్ పక్కన చిన్న గది వుంది. అందులోనే వుంటాడు."

"అతడికి భార్య లేదా?"

"భార్య చనిపోయింది సార్, కూతురికి పెళ్ళయి సంవత్సరమైంది. అది మొగుడితో ఉంటుంది."

గిరి కిందకు పరుగెత్తుకొచ్చాడు. వాలి అతనివైపు తిరిగారు.

"వాలిగారూ, ఆమె ఒంటిమీద నగలు, కనీసం రెండు లక్షల రొక్కం పోయివుంటుందని సుబ్బలక్ష్మి, సుందరం అంటున్నారు" అన్నాడు గిరి.

"యెక్కువే" అన్నాడు వాలి.

"డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షించారు. ఆమె క్రితం రాత్రి పదకొండు తర్వాత, ఒంటిగంటముందు మరణించి ఉంటుందని అన్నారు! శవ పరీక్ష పూర్తిగా జరిగాక సరైన టైమ్ తెలుస్తుందన్నారు."

వాలి ఆలోచిస్తూ సమీపంలో ఉన్న చెట్టుకిందకు వెళ్ళాడు. గిరి యెదురుగా సమీపంలో నిలబడ్డాడు.

"గిరీ, పదకొండు తర్వాత యెవరైనా పైకి వెళ్ళుంటే తప్పక ఆమె తలుపు తెర్చివుండాలి! యెవరో ఫోన్ చేసి ఆమెతో మాట్లాడారు. యెప్పుడు వచ్చేది చెప్పారు. ఆమె తలుపు తెర్చింది!" అన్నాడు వాలి.

"యెవరై ఉంటారు?"

"అది మనం కనుక్కోవాలి. సుందరాన్ని గమనిస్తూ వుండు! శమంత పోతే వెంటనే లభించేది అతడికే! అన్న అమెరికాలో వున్నాడు. అతడు యిక్కడకు రాక పోవచ్చు!"

"సుందరంతో మాట్లాడాను, సార్. శమంత అమెరికా వెళ్ళి వచ్చిందట. తన తల్లి మనసు కొంతకాలం పోయాక మారుందనే నమ్మకంలో సుందరం వేరే కాపురం పెట్టానన్నాడు. అతడా హత్య చేసే వ్యక్తిలా కనబడ్డంలేదు!" అన్నాడు గిరి.

గేటు దాటి ఒకతను మెల్లిగా లోపలకు వచ్చాడు. వాలి అతడివైపు వెళ్ళాడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు వాలి.

"నేను యిక్కడ పనిచేస్తున్నాను సార్. నా పేరు కూనయ్య."

"వెళ్ళు!" అన్నాడు వాలి.

కూనయ్య వెనక వైపుకు వెళ్ళాడు. వాలి పెద్ద అంగల్లో అటువైపు కదిలాడు. కూనయ్య తన గదికి వేసిన తాళాన్ని తెర్చి లోపలకు వెళ్ళాడు. గుమ్మంలో నిలబడి వాలి లోపలకు చూశాడు.

కూనయ్య గాభరాగా వెనక్కు వచ్చాడు.

"అయ్యా, మీరా?" అన్నాడతను.

అతడివైపు సూటిగా చూశాడు.

"నిన్నరాత్రి యీ గదిలోనే పడుకున్నావా?"

అతడు తలాడించాడు.

"పదకొండు తర్వాత యెవరేనా పైకి వెళ్ళడం చూశావా?"

"లేదు సార్. ఏమైంది?"

"కూనయ్యా, కాంపౌండులో పోలీసులు, ప్రజలు ఎందరో వున్నారు. ఏం జరిగిందో తెలియదా?"

"ఏదో హత్యని రోడ్డుమీద వాళ్ళు చెప్పుకుంటుంటే విన్నానండి. ఏదీ వివరంగా తెలీదు."

"పైనుండే శమంతను యెవరో చంపారు!" అన్నాడు వాలి.

కూనయ్య ఉలిక్కిపడ్డాడు.

"హత్యచేసిన వ్యక్తి వెనక మెట్లమ్మట పైకి వెళ్ళాడు. నువ్వీ గదిలోంచి అతడిని చూడొచ్చు!"

"నేను చూడలేదు సార్. నిన్న రామయ్యతో మాట్లాడి తర్వాత వచ్చి పడుకున్నాను."

"పొద్దుటే యెక్కడికెళ్ళావు?"

"నా కూతురింటికి వెళ్ళానండి. అల్లుడు తాగుబోతు. తాగి దాన్ని వాయిస్తున్నాడని విని పొద్దుటే వెళ్ళాను."

"నువ్వు పట్టుకెళ్ళిన సంచి ఏమైంది?"

"అది పిల్ల యింట్లో వదిలేశాను, సార్. కొంచెం బియ్యం అందులో పోసి పట్టుకెళ్ళి దానికిచ్చాను."

"నీ అల్లుడు ఏం చేస్తున్నాడు?"

"కూలిపని చేసుకుని బతుకుతున్నాడు. కూలిపని దొరక్కపోతే నా కూతుర్ని తంతాడు. తండ్రినడిగి ఏదైనా పట్రామంటాడు."

"నీ కూతురు ఎక్కడుంటోంది?"

"అదొక గుడిసె సార్. మారుమూలుంది."

క్షణకాలం వాలి కూనయ్యవైపు పరీక్షగా చూశాడు. కూనయ్య ఏదో దాస్తున్నాడు. అతడి ఒళ్ళు వణుకుతోంది. కళ్ళలో భయం స్పష్టంగా కనిపిస్తోంది.

వాలి వెనక్కు తిరిగి దూరంగా నడిచాడు. వెనక నే

వచ్చాడు గిరి.

"గిరీ, కూనయ్య కూతురు గుడిసె రామయ్యకు తెలిసి వుండొచ్చు. అతడితో నువ్వు అక్కడకు వెళ్ళు. కూనయ్య పొద్దుటే వెళ్ళి ఒక సంచిని తన కూతురు యింట్లో వదిలాడు. అందులో బియ్యం పోసి పట్టుకెళ్ళానని నాతో అనడం నువ్వు వినే వుంటావు!"

"అంతా విన్నాను, సార్."

"అక్కడికి వెళ్ళి ఆ సంచిలో ఏముందో కనుక్కో!"

"అలాగే సార్" అని వెళ్ళిపోయాడు.

వెనక మెట్లెక్కి వాలి పైకి వెళ్ళాడు. హాల్లో ఒక కానిస్టేబుల్ నిలబడి వున్నాడు. సోఫాల్లో సుందరం, మాధవి, సుబ్బలక్ష్మి కూర్చుని వున్నారు.

ఇన్‌స్పెక్టర్ నాయర్ నవ్వుతూ వాలి దగ్గరకొచ్చాడు.

"వాలిగారూ, మీ కోసం చూస్తున్నాను" అన్నాడు యిన్‌స్పెక్టర్ నాయర్.

"నాయర్ భాయ్, ఏదేనా తెల్సిందా?"

"డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షించి వెళ్ళిపోయారు. ఫోటోలు తీయడం పూర్తయింది. పడగ్గదిలో, బాత్‌రూమ్‌లో మా ఫింగర్ ప్రింట్స్ వాళ్ళు పనిచేస్తున్నారు."

"నాయర్ భాయ్, పడగ్గదిలో టేబుల్ మీద స్కాచ్ విస్కీ బాటిల్, సోడా బుడ్లు వున్నాయి. వాటిమీద వేలిముద్రలు వున్నాయేమో చూడమను" అన్నాడు వాలి.

"వాటినిగురించి నేను మర్చేపోయాను, సార్. ఇప్పుడు వాళ్ళకు చెప్తాను" అని యిన్‌స్పెక్టర్ పడగ్గదిలోకి పరిగెత్తాడు.

ఆరిపోయిన చుట్టను వాలి లైటర్‌తో వెలిగించి పొగ

పిల్చి వదులుతూ సుందరం ముందు నిలబడ్డాడు.

"అబ్బాయి, నీ తల్లి అమెరికా వెళ్ళి వచ్చిందని విన్నాను. ఆమెకు తాగే అలవాటుందా?"

"అమ్మ తాగడం నేను చూడలేదు సార్."

"ఆమె గదిలో స్కాచ్ విస్కీ బాటిల్ యెందుకుందో!" అన్నాడు వాలి.

"నేను చెప్పలేను సార్."

"అబ్బాయి, నువ్వు తాగుతావా?"

"నాన్నగారు తాగేవారు. నేను డ్రింకర్ని కాను సార్, కాని అప్పుడప్పుడు కొద్దిగా తాగుతాను."

"మీ అమ్మ టేబుల్ మీదున్న విస్కీ బాటిల్ని నువ్వు చూశావా?"

"ఆమె టేబుల్ మీద విస్కీ బాటిల్ వుండడం నేను గమనించాను."

"ఆమె నీకు విస్కీ ఆఫర్ చేసిందా?"

"లేదు సార్. నేను యీ యింట్లో వున్నంతకాలం స్టూడెంట్ని. పెళ్ళిముందు నేను బయటకు వెళ్ళిపోయాను. తర్వాత నాకు ఉద్యోగం వచ్చింది. అమ్మ నాకెన్నడూ విస్కీ యివ్వలేదు."

వాలి అతడి వంక సూటిగా చూశాడు.

"నిన్న రాత్రి పదకొండు, ఒంటి గంట మధ్య నువ్వు యెక్కడున్నావు?"

"ఇంట్లోనే వున్నాను. పదింటికే నిద్రపోయాను."

వాలి విచిత్రంగా నవ్వాడు.

"కొత్తగా పెళ్ళయిన వాడివి, పదింటికే పడుకున్నావా?"

సుందరం ఏం చెప్పాలో తోచక భార్యవైపు చూశాడు.

"ఆయన నిన్న ఐదింటికి ఆఫీసునుంచి వచ్చారు. ఎనిమిదింటికి భోజనం చేశాం, పదింటికి పడుకున్నాం" అంది మాధవి.

గబగబా గిరి హాల్లోకొచ్చాడు. వాలి అతడితో హాలు మూలకు వెళ్ళాడు. గిరి చేతిలో సంచి వుంది.

"వాలిగారూ, కూనయ్య కూతురు గుడిసెలో లేదు. లోపలకు నేనూ రామయ్యా వెళ్ళాం. నులక మంచం కింద ఒక ట్రంకుపెట్టె వుంది. పెట్టె తెరిచి చూస్తే యీ సంచి గుడ్డలకింద వుంది. సంచిలో వున్నవాటిని చూసి ఆశ్చర్యపోయాను!" అన్నాడు గిరి.

వాలి సంచిలో వున్న నగలను చూశాడు. చంద్రహారం! డైమండ్ కమ్మలు. బంగారం గాజులు! ఆటోమేటిక్ అమెరికన్ వాచ్!

"వాలిగారూ, కూనయ్యను మీరు ఎలా అనుమానించారో నాకు ఆశ్చర్యంగా వుంది. ఇదంతా చేసింది కూనయ్యే! ఈ నగలను పట్టుకుపోయి కూతురి పెట్లో పెట్టి తిరిగొచ్చాడు. అతడి గది సోదాచేస్తే పోలీసులకు ఏమీ దొరికేది కాదు!" అన్నాడు గిరి.

వాలి మౌనంగా వుండిపోయాడు. నగలమీద రక్తం మరకలు యెక్కడా లేవు. కూనయ్యకు ఆమెతో అక్రమ సంబంధం వుందా? తలుపులు తెర్చి కూనయ్యను ఆమె లోపలకు రానిచ్చిందా? కాని కూనయ్య ఆమె నెందుకు చంపాడు? సంచిలో నగలు మాత్రం యెందుకున్నాయి? రొఖ్ఖం యెందుకు లేదు? వాలి మెదడులో విశేషంగా ఆలోచనలు సాగుతున్నాయి.

"వాలిగారూ, మనం ఆలస్యం చేస్తే కూనయ్య పారిపోవచ్చు! వెళ్ళి అతడిని అరస్టుచెయ్యాలి" అన్నాడు గిరి.

"గిరీ, యీ సంచిని ఇన్‌స్పెక్టర్ నాయర్‌కి అందజేయి" అని వాలి వెనకవైపుకు వెళ్ళాడు.

వేగంగా మెట్లు దిగి కిందకు చేరుకున్నాడు. కూనయ్య తన గది ముందు నిలబడి వున్నాడు. వాలి అతడి కెదురుగా వెళ్ళి నిలబడ్డాడు.

"కూనయ్యా, నువ్వు నీ కూతురి గుడిసెలో పెట్లో పెట్టిన సంచిని రామయ్య సహాయంతో మేం వెళ్ళి పట్టుకొచ్చాం!" అన్నాడు వాలి.

అతడి మొహంలో నెత్తురు చుక్క లేదు. అతడు అమాంతంగా నేల కూలిపోయాడు. వణుకుతున్న అతడి చేతులు వాలి కాళ్ళను పట్టుకున్నాయి. అతడు ఏడుస్తున్నాడు.

"ఆమెను యెందుకు చంపావు?" బులెట్‌లా వెలువడింది వాలి ప్రశ్న.

"నేనామెను చంపలేదు సార్."

"ఆ నగలు నీకెలా వచ్చాయి?"

"నా గదిలో పడుకున్నాను, సార్. ఒంటికి పోదామని బయటకొచ్చి గోడవారగా వెళ్ళాను. బాగా చీకటిగా వుంది. ఎవరో మెట్లమ్మట కిందకు దిగి చీకట్లోకి పోవడం వెనక్కు తిరిగి చూశాను."

"ఎవరతను?"

"చీకట్లో అతడిని నేను పోల్చలేను."

"అతడు ఎటువైపు వెళ్ళాడు?"

"ఎడంవైపుకు తిరిగి వెళ్ళిపోయాడు."

"నువ్వు ఏం చేశావు?"

"అతడు పైకి యెందుకెళ్ళాడో తెల్సుకుందామని మెట్లెక్కాను. ఒక తలుపు తెరిచి వుంది. లోపలకెళ్ళాను.

బాత్ రూమ్‌లో రక్తమయంగా ఆమె పడుంది. ఒంటి మీదున్న నగలు లైటు కాంతిలో మెరుస్తున్నాయి. నగల్నీ, వాచ్ నీ తీసేసి, వాటిని పట్టుకుని కిందకు పరుగెత్తాను. వాడు మళ్ళా వస్తాడేమో అని నా భయం! రాత్రి నాకు నిద్రపట్టలేదు. అవి నా గదిలో ఉంటే ప్రమాదం. ప్రతిరోజూ ఏడింటికి ఆఫీసుకుపోయే కామరాజు గారు యివాళ ఆరింటికే వెళ్ళిపోయారు. సంచిలో అవన్నీ పెట్టి నేను కూతురింటికి వెళ్ళాను. అది గుడిసెలో లేదు. పని చేయడానికి పోయి ఉంటుంది. సంచిని అక్కడ పెట్టి తిరిగొచ్చాను" అన్నాడు కూనయ్య.

ఆలోచిస్తూ వాలి మెట్ల దగ్గరకు వెళ్ళాడు. ఎడం వైపుకు తిరిగి వేగంగా నడిచాడు. కొంచెం దూరం వెళ్ళాక కామరాజు ముందుగుమ్మం కనిపించింది. తలుపులు మూసి ఉన్నాయి.

వాలి తలుపును తట్టాడు. కాసేపయ్యాక ఒక స్త్రీ తలుపు తెరిచి వాలివైపు చూసింది. ఆమె వయస్సు అరవై పైన ఉంటుంది. తెల్లటి చీర, అదే రంగు రవిక. మెళ్ళో నగలులేవు. జుత్తు బాగా నెరిసింది.

"కామరాజు ఉన్నాడా?" అడిగాడు వాలి.

"లేడు. ఆఫీసుకెళ్ళాడు" అందామె.

"నిన్న రాత్రి పదకొండు తర్వాత అతడు మా యింటికొచ్చినప్పుడు యివాళ పొద్దుటే వచ్చి డబ్బిస్తానన్నాను" అన్నాడు వాలి.

"నిన్న రాత్రి వాడు మీ యింటికా వెళ్ళింది?" అడిగిందామె.

వాలి తలాడించాడు.

"రాత్రిళ్ళు నాకు నిద్రపట్టదు బాబూ. పన్నెండు

కొద్దూంటే వాడు వెళ్లాడు. నేను మెలుకువగా ఉండడం చూసి ఫ్రెండ్ యింటికెళ్ళి వస్తానని చెప్పాడు. తలుపు తాళంవేసుకు పోయాడు. ఇలా అర్థరాత్రివేళ అబ్బాయి తిరగడం నాకు నచ్చదు. బాబూ మిమ్మల్ని వేడుకుంటున్నాను. మావాడికి యిటుపైన ఆ విస్కీ యివ్వకండి!" అందామె.

"విస్కీ నేను తాగను, యెవరికీ ఇవ్వను. అతడు మరెక్కడో తాగివచ్చి ఉంటాడు" అన్నాడు వాలి.

వాలి ఆమెవైపు మౌనంగా చూశాడు.

"మీ ఇంట్లో ఫోనుందా?"

"ఉంది బాబూ."

"ఒకసారి ఫోన్ చేసి మీవాడితో మాట్లాడాలి!"

"రండి, లోపలకు" అందామె.

ఆమె వెనక్కి కదిలింది. విశాలమైన హాల్లోకి వెళ్ళాడు వాలి.

"మీ అబ్బాయి నంబరు తెలుసా?"

ఆమె నంబరు చెప్పింది. వాలి టెలిఫోన్ దగ్గరకు నడిచాడు. వెనుతిరిగి ఆమెవైపు చూశాడు.

"ప్లీజ్, మంచినీళ్ళు ఇవ్వండి" అన్నాడు.

ఆమె లోపలకు వెళ్ళింది. అతడు నంబరు తిప్పాడు.

"హలో, రామ్ టింబర్ కంపెనీ!"

"కామరాజుగారున్నారా?" అడిగాడు వాలి కంఠం మార్చి.

"కామరాజు స్పీకింగ్!"

"నేను సుందరాన్ని సార్, గుర్తున్నానా? అమ్మను యెవరో చంపారు!"

"గుడ్ హెవెన్స్! షాకింగ్!"

"హంతకుడు దొరికాడులెండి. పోలీసులు మీ నౌఖరు కూనయ్యను అరెస్టు చేశారు. అతడి దగ్గర అమ్మ నగలన్నీ దొరికాయి. నాలుగు దెబ్బలు వేయగానే తనే ఆమెను చంపానని వాడు ఒప్పేసుకున్నాడు. ఇక్కడ మేమందరం విచారంతో ఏడుస్తున్నాం. మీరు వెంటనే వచ్చి మాకు ధైర్యాన్నివ్వాలి!"

"సుందరం, నేను వస్తున్నా. ఆమె చాలా మంచిది. యెందరికో సహాయం చేసింది. ఐ యామ్ కమింగ్!"

"ప్లీజ్" ఏడుపు కంఠంతో అంటూ వాలి రిసీవర్ని పెట్టేశాడు.

ఆమె తెచ్చిన గ్లాసును అందుకుని నీళ్ళను గడగడ తాగేశాడు. బయటకొచ్చి వాలి మెట్లమ్మట పైకి పరుగెత్తాడు. హాల్లో ఇన్స్పెక్టర్ నాయర్ అతడికెదురుగా వచ్చాడు.

"వాలిగారూ, స్కాచ్ విస్కీ బాటిల్ మీద ఇద్దరి వేలిముద్రలు ఉన్నాయి. శమంత వేలిముద్రలు ఉన్నాయని మా ఫింగర్ ప్రింట్స్ వాళ్ళు పోల్చారు. తతిమ్మా వేలిముద్రలు యెవ్వరివో తెలియడంలేదు," అన్నాడు ఇన్స్పెక్టర్ నాయర్.

"నాయర్ భాయ్, సుందరాన్ని ఓదార్చడానికి కింద నివశించే కామరాజు వస్తున్నాడు. ఆ వేలిముద్రలు అతడివేమో చూడమను!"

ఇన్స్పెక్టర్ నాయర్ ఆశ్చర్యంగా చూశాడు.

"వాలిగారూ, కూనయ్యని అరెస్టు చెయ్యనా?"

"అతడు పారిపోకుండా జాగ్రత్తపడు!" అన్నాడు వాలి.

"ఒక కానిస్టేబుల్ని అతడి గదిముందు కాపలా ఉంచాను. కామరాజు వేలిముద్రలు యెందుకు సార్?"

"చూశాక నీకే తెలుస్తుంది!" అన్నాడు వాలి.

గబగబా నడుస్తూ కామరాజు హాల్లోకొచ్చాడు. సోఫాలో కూర్చున్న సుందరం ముందుకు వెళ్ళాడు. సుందరం ఏడ్వసాగాడు. కామరాజు అతడిని ఓదార్చుతున్నాడు.

మెల్లిగా వాలి అతడి దగ్గరకు వెళ్ళాడు. ఇన్స్పెక్టర్ నాయర్ ఫింగర్ ప్రింట్స్ వాళ్ళతో అక్కడికొచ్చాడు. గిరి ఒక గ్లాసులో మంచినీళ్లు తెచ్చి కామరాజు కిచ్చాడు.

"కామరాజుగారూ, యీ నీళ్ళు యెలాగైనా అతడి చేత తాగించండి. పొద్దుటనుంచి ఏడుస్తున్నాడు" అన్నాడు గిరి.

కామరాజు గ్లాసును అందుకున్నాడు.

"సుందరం, ధైర్యం తెచ్చుకో! ఈ మంచినీళ్ళు తాగు!"

"ప్లీజ్ వద్దు!" అన్నాడు సుందరం.

"తాగేటట్లు లేడు" అని గిరి గ్లాసును తీసుకుని ఫింగర్ ప్రింట్స్ వాళ్ళకు అందించాడు.

వాళ్ళు పడగ్గదిలో కెళ్ళిపోయారు. ఇన్స్పెక్టర్ నాయర్ వాళ్ళ వెనకనే పరుగెత్తాడు.

* * *

"కామరాజూ, నిన్న రాత్రి నువ్వు పన్నెండు ప్రాంతంలో యెక్కడున్నావు?" అడిగాడు వాలి.

"నా గదిలో నిద్రపోతున్నాను."

"ఏ ఫ్రెండ్ ఇంటికో వెళ్ళావని నీ తల్లి చెప్పింది!"

కామరాజు తృళ్ళిపడ్డాడు.

"నువ్వు వెనక మెట్లు దిగిపోతుంటే చీకట్లో నిలబడిన కూనయ్య నిన్ను చూశాడు!" అన్నాడు వాలి.

కామరాజు గుండె దడదడ లాడ్తోంది.

"శమంత పడగ్గదిలోని విస్కీ బాటిల్ మీద, సోడా బుడ్లమీద నీ వేలిముద్రలు ఉన్నాయి" గర్జించాడు వాలి.

కామరాజు నోటమ్మట మాట పెగల్లేదు.

సోఫాలో కూర్చున్న కామరాజు నేలమీదకు కూలి పోయాడు.

"ఆమెను యెందుకు చంపావు?" అడిగాడు వాలి.

"ఆమె పదేళ్ళగా తన శరీరాన్ని నాకిచ్చేది. నేను డబ్బడిగితే తన దగ్గర లేదంది. నేను కష్టంలో వున్నాను. నా కంపెనీ డబ్బును అధికంగా నేను వాడుకున్నాను. ఆ డబ్బును నేను బాంకిలో వేయాలి. లేకపోతే నేను జైలు కెళ్ళవలసి వస్తుంది. ఆ పరిస్థితుల్లో ఆమెను చంపి, బీరువాలో వున్న నోట్లకట్లను పట్టుకు వెళ్ళిపోయాను."

"ఎంత పట్టుకుపోయావు?"

"నేనింకా లెఖ్ఖ పెట్టలేదు."

"నువ్వు పైకి ఎలా వచ్చావు?"

"కిందనుంచి ఫోన్ చేసి మాట్లాడాను. పన్నెండింటికి రమ్మంది. వెనుక తలుపులు ఆమే తెర్చింది. అలా రాత్రిళ్లు కలుసుకోడం మాకు అలవాటే!"

వాలి పక్కనున్న యిన్స్పెక్టర్ నాయర్ వంక చూశాడు.

"నాయర్ భాయ్, అడుగో శమంత హంతకుడు!" అన్నాడు వాలి.

ఇన్స్పెక్టర్ నాయర్ కామరాజు చేతులకు బేడీలు వేశాడు.

వాలి, గిరి ముందు మెట్లమ్మట కిందకు దిగారు. ఇన్‌స్పెక్టర్ నాయర్ వెనకనే వెళ్ళాడు.

ఆరిపోయిన చుట్టను దూరంగా విసిరి వాలి మరో చుట్టను లైటర్‌తో వెలిగించి కార్లో కూర్చున్నాడు. నాయర్ నవ్వుతూ వాలికి నమస్కరించాడు.

"మీరు రావడం వలన యీ హత్యకేసు కొన్ని గంటల్లో తేలిపోయింది. మీకు నా ధన్యవాదాలు" అన్నాడు యిన్‌స్పెక్టర్.

వాలి నవ్వుతూ యిన్‌స్పెక్టర్ వైపు చూశాడు. గిరి కారును వెనక్కి తిప్పి పోనిచ్చాడు.

—: ఐపోయింది :—

"ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ"

ఈ నెల "సప్లిమెంట్" ముఖచిత్రాలు (అట్టమీది బొమ్మ, అట్టచివరి బొమ్మ) పరిశీలించండి. రెండు ము ఖ చి త్రా ల కు సంబంధం వుండేటట్లుగా ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలో గాని, పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, ఈ నెల 7 వ తేదీ లోపు మాకు చెరేటట్లు పంపండి.

'హోమ్ డెలివరీ' సభ్యులు తమ పూర్తి చిరునామాతో పాటు, తమ నెంబర్ కూడా వ్రాయాలి. సభ్యులు కానివారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు పంపాలి.

మాకు వచ్చిన వ్యాఖ్యలలో అత్యుత్తమమైన వ్యాఖ్యకు రు. 25/- లు నగదు బహుమతి పంపుతాము.

"హోమ్ డెలివరీ"

మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 9/- లకే మా ఏజెంట్ ద్వారా గాని, వి.పి. ద్వారాగాని మీ యింటి దగ్గర అందజేస్తాము. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మావే.

మీరు చేయవలసిందల్లా రు. 5/-లు పంపి 'హోమ్ డెలివరీ'

'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెలనెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరగాల్సిన అవసరం వుండదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం లేదు.

నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు ఏడాది పైకము రు. 108/-లు ముందుగా పంపవచ్చును.